క్లుప్తంగా

మెనూ ప్రకారం భోజనం అందించాలి



పాన్‌గల్: మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం నాణ్యతగా అందించాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని బుసిరెడ్డిపల్లి పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఈఓ విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతం, విద్యార్థుల సామర్థ్యాలు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి నిత్యం మధ్యాహ్న భోజనం నాణ్యతగా అందేలా చూడాలని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



గోపాల్‌పేట: ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయులు చొరవ తీసుకొని చదువులో వెనకబడిన విద్యార్థులకు ఇంగ్లిష్, తెలుగులో కనీస సామర్థ్యాలు పెంచేందుకు కృషి చేయాలని ఎంఈఓ శ్రీనివాస్‌గౌడ్ ఆదేశించారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలిమెట్టు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా చేపట్టి చదువులో వెనకబడిన విద్యార్థులను ఆయా పాఠశాలల ఉపాధ్యాయుల ద్వారా గుర్తించి ఎప్పటికప్పుడు మెరుగుపడేలా చూడాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు.

ఆర్థికసాయం అందజేత



పెబ్బేరు రూరల్: మండలంలోని శేరుపల్లికి చెందిన మేకల గోవిందమ్మ అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాములుయాదవ్ స్థానిక నాయకులతో కలిసి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వనపర్తి మండలంలోని పెద్దగూడెం గ్రామానికి చెందిన వడ్ల లక్ష్మమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. స్థానిక నాయకులు బాధిత కుంటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అదించారు. కార్యక్రమంలో గంగాదర్‌యాదవ్ పాల్గొన్నారు.

ముగ్గురు యువకులపై కేసు నమోదు

వీపనగండ్ల: మండల కేంద్రానికి చెందిన ముగ్గురు గురువారం రాత్రి మద్యం తాగి దురుసుగా ప్రవర్తించడంతో వారిపై కేసు నమోదు చేసి వనపర్తి కోర్టులో హాజరు పరిచారు. దీంతో వారికి 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఇన్‌చార్జ్ ఎస్‌ఐ ఓబుల్‌రెడ్డి, ఏఎస్‌ఐ చంద్రారెడ్డి తెలిపారు. గురువారం రాత్రి ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంప్ వద్ద దయ్యాపు రాజశేఖర్, గడ్డమీది అభిషేక్, బండారి విష్ణు అనే యువకులు రోడ్డుపై మద్యం సేవిస్తున్నారు. ఆ సమయంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ సురేందర్‌రావు, హోంగార్డు ధర్మలు బహిరంగంగా మద్యం సేవించరాదని వారికి సూచించిగా.. వారు దురుసుగా ప్రవర్తించడంతో స్టేషన్‌కు తీసుకొచ్చారు. పోలీస్‌స్టేషన్‌లో కూడా తాగిన మైకంలో పోలీస్ అధికారులను దుర్భాషలాడుతూ అసభ్యంగా ప్రవర్తించడంతో వారిపై కేసు నమోదు చేసి కోర్టు ఆదేశానుసారం రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు.

మంత్రి జూపల్లికి స్వాగతం



పాన్‌గల్: రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రిగా పదవి బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటి సారిగా శుక్రవారం రాత్రి మండలం మీదుగా కొల్లాపూర్ వెళ్తున్న మంత్రి జూపల్లికి మండలంలో ఘన స్వాగతం లభించింది. అన్నారం, పాన్‌గల్, కేతేపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో చేరుకొని మంత్రికి స్వాగతం పలుకుతూ శాలువాలతో ఘనంగా సన్మానించారు.

ఫీజు గడువు పెంచాలి

కొల్లాపూర్: ఇంటర్ పరీక్షల ఫీజు గడువు పెంచాలని గాయత్రీ విద్యా సంస్థల చైర్మన్ సురగౌని శ్రీనివాస్‌గౌడ్ కోరారు. శుక్రవారం ఆయన హైదరాబాద్‌లో ఇంటర్‌బోర్డు కార్యదర్శి శృతి ఓజాను మర్యాదపూర్వకంగా కలిశారు. సకాలంలో పరీక్షల ఫీజులు చెల్లించలేకపోయారని, వారికి మరోసారి అవకాశం కల్పించాలని కోరారు. అనంతరం వినతిపత్రం అందజేశారు.



పామాపురంలో..



కాశీంనగర్‌లో..



వెంకటాపురంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ రాజేంద్రప్రసాద్

ప్రతి కుటుంబానికి న్యాయం చేసేందుకే..

అమరచింత: ప్రజాపాలన కార్యక్రమం ద్వారా ప్రతి కుటుంబానికి ఆరు గ్యారెంటీల దరఖాస్తు పత్రాలను కౌంటర్ వద్ద ఉచితంగా అందిస్తున్నామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గ ప్రత్యేక అధికారి, డీపీఓ సురేష్‌కుమార్ అన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని ధర్మాపూర్, చింతరెడ్డిపల్లిలో ఏర్పాటు చేసిన కౌంటర్లను పరిశీలించారు. ధర్మాపూర్‌లో 181 కుటుంబాలు, చింతరెడ్డిపల్లిలో 115 మంది దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ స్వరణ్‌సింగ్, తహసీల్దార్ చాంద్‌పాషా, ఎంపీడీఓ జ్యోతి, ఎంపీఓ నరసింహులు, అధికారులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో..

పట్టణంలోని పది వార్డుల్లో రెండో రోజు 704 మంది దరఖాస్తు పత్రాలను సమర్పించారు. శనివారం మున్సిపాలిటీ ద్వారా జిరాక్స్‌తో కూడిన పత్రాలను ఉచితంగా అందిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖాజా తెలిపారు. అదేవిధంగా పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కౌంటర్‌ను ఎస్‌ఐ జగన్మోహన్ శుక్రవారం పరిశీలించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్లు ఎల్లస్వామి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: మున్సిపాలిటీలో 1,755 దరఖాస్తులు, గుంటిపల్లిలో 475, తూంపల్లిలో 382 దరఖాస్తులు వచ్చాయని మండల ప్రత్యేకాధికారి సుబ్బారెడ్డి, తహసీల్దార్ రాజు, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, కమిషనర్ నాగరాజు తెలిపారు. శనివారం కత్తేపల్లి, బాలకిష్టాపూర్‌లో గ్రామసభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: అర్హులు అందజేసే ప్రజాపాలన దరఖాస్తుల వివరాలను ప్రత్యేక రిజిస్టర్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేసి, వారికి రశీదు అందజేయాలని డీఆర్‌డీఓ పీడీ నర్సింహులు అన్నారు. శుక్రవారం మండలంలోని చింతకుంట గ్రామసభలో ఆయన దరఖాస్తులను పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ రఘురాములు, ఏపీఓ కుర్మయ్య, మండల పశువైద్యాధికారి డా.శ్యామ్, సర్పంచ్ అనూష, ఎంపీటీసీ సభ్యురాలు రమాదేవి, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులందరికీ..

రెండో రోజు శుక్రవారం మండలంలో 1,094 దరఖాస్తులు వచ్చినట్లు మత్స్యశాఖ ఏడీ, మండల ప్రత్యేకాధికారి రహమాన్ తెలిపారు. మండలంలోని చింతకుంటలో 133, బుసిరెడ్డిపల్లిలో 603, చిక్కేపల్లిలో 285, మొదటి రోజు జరిగిన గ్రామాల్లో 73 దరఖాస్తులు కలిపి మొత్తం 1,094 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాంబాయి, ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ సర్పంచ్‌లు సింధూజ, బాల్యస్వామియాదవ్, అధికారులు పాల్గొన్నారు.



ఆత్మకూర్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని కాశీంనగర్, దత్తాయిపల్లి, నాగమ్మతండా, పెబ్బేరు మండలంలోని కంచిరావుపల్లితండా, రాంపూర్, రామమ్మపేట, తోమాలపల్లి, శ్రీరంగాపురం మండలంలోని వెంకటాపురం గ్రామాల్లో రెండో రోజు ప్రజాపాలనలో భాగంగా దరఖాస్తులు స్వీకరించారు. వనపర్తి మండలంలో 256, పెబ్బేరు మండలంలో 509, శ్రీరంగాపురం మండలంలో 394 దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీఓలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కిచ్చారెడ్డి, జెడ్పీటీసీ రాజేంద్రప్రసాద్‌యాదవ్, ఎంపీడీఓలు ప్రవీణ్‌కుమార్, ప్రసన్నకుమారి, సుదర్శన్, తహసీల్దార్లు మురళీగౌడ్, లక్ష్మి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

మదనాపురం: మండలంలోని దంతనూరులో 275, కరివెనలో 77, ద్వారకానగరంలో 102, బౌసింగ్ తండాలో 91 దరఖాస్తులు వచ్చాయి. దంతనూరులో జెడ్పీ సీఈఓ రామమహేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. తహసీల్దార్ అబ్రహంలింకన్, ఎంపీడీఓ నాగేంద్రం వేర్వేరుగా దరఖాస్తు తీసుకున్నారు.

కొత్తకోట రూరల్: మండలంలోని పామాపురం, పాలెం గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా అధికారులతో కలిసి టీపీసీసీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.ప్రశాంత్, కాంగ్రెస్ నాయకులు దరఖాస్తుల స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాల్‌రెడ్డి, ఎంపీడీఓ కృష్ణయ్య, బీచుపల్లియాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, సాయిరెడ్డి, రాధకృష్ణారెడ్డి, లోకారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: రెండో రోజు ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా గోవర్ధనగిరిలో 273, వల్లభాపురంలో 8 దరఖాస్తులు స్వీకరించినట్లు తహసిల్దార్ వరలక్ష్మీ, ఎంపిడిఓ కతలప్ప తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



దంతనూరులో జెడ్పీ సీఈఓ రాంమహేశ్వర్‌రెడ్డి



ధర్మాపురంలో డీపీఓ సురేష్‌కుమార్



తూంపల్లిలో..



బుసిరెడ్డిపల్లిలో..



అమరచింతలో ఎస్‌ఐ

ప్రభుత్వ బడుల బలోపేతానికి కృషి



ఆత్మకూర్‌లో..

ఆత్మకూర్: బడి మధ్యలో మానేసిన పిల్లలను పనులకు కాకుండా బడులకు పంపాలని.. తిరిగి పాఠశాలల్లో చేర్పిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని ఎంఈఓ భాస్కర్‌సింగ్ అన్నారు. శుక్రవారం ఆత్మకూర్ మండలంలోని గ్రామాల్లో బడిబయట పిల్లల సర్వే నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా సీఆర్పీ సౌమ్యరాణి ఇంటింటికీ వెళ్లి వివరాలను సేకరించారు. చదువు ప్రాముఖ్యతను వివరిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.



పాన్‌గల్‌లో ఇంటింటి సర్వేలో సీఆర్పీలు

పాన్‌గల్: బడిఈడు కలిగిన పిల్లలను క్రమం తప్పకుండా బడులకు పంపిస్తూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తల్లిదండ్రులు తోడ్పాటునందించాలని సీఆర్పీలు గోవింద్‌నాయక్, సంతోష్ అన్నారు. బడిఈడు పిల్లల ఇంటింటి సర్వేలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో సీఆర్పీలు పర్యటించి వివరాలు సేకరించారు. విద్యార్థులు బడి మధ్యలో మానేయడానికి గల కారణాలపై ఆరా తీశారు. బడిఈడు పిల్లలచే పనులు చేయించడం నేరం అన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు రమాదేవి, భార్గవి పాల్గొన్నారు.

సిబ్బందికి సౌకర్యాలు కరువు

అమరచింత: పట్టణంలోని ఆయా వార్డుల్లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కౌంటర్ల వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి కనీస వసతులు కల్పించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రతి కౌంటర్‌కు రోజుకు రూ.వెయ్యి చొప్పున ఖర్చు చేయాలని, వీటిలోనే టీ, టిఫిన్లు సిబ్బందికి సమకూర్చాలనే నియమం ఉన్నా పట్టించుకోవడం లేదు. కౌంటర్ల వద్ద తాగునీటిని అందుబాటులో ఉంచట్లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంలో మున్సిపల్ కమిషనర్ చొరవ చూపి సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

ఉచిత కుట్టు శిక్షణ

గోపాల్‌పేట: మండల కేంద్రంలో స్వామి రామానంద తీర్థ ఆధ్వర్యంలో జనవరి 1 నుంచి ఉచిత కుట్టు మిషన్ శిక్షణ 49వ బ్యాచ్ ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకురాలు రామేశ్వరమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉచితంగా కుట్టుమిషన్ నేర్చుకోదలచిన వారు వెంటనే మండల కేంద్రంలోని స్వామి రామానంద తీర్థ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

అమరచింత: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని లబ్ధిపొందుతున్నారని వికాసిత్ భారత్ సంకల్ప యాత్ర టీం సభ్యులు సామ్రాజ్యలక్ష్మి తెలిపారు. మండలంలోని ప్రియదర్శిని నందిమళ్ల ఎక్స్‌రోడ్ గ్రామంలో శుక్రవారం కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు జాతీయ ఉపాధి హామీ పథకం, వ్యవసాయ రంగంలో రైతులకు సబ్సిడీలపై యంత్రాలను అందిస్తుందన్నారు. వ్యాపారులకు బ్యాంకు నుంచి రుణాలు మంజూరు చేసి వ్యాపారభివృద్ధికి దోహద పడుతుందన్నారు. పోస్టాఫీస్‌ల ద్వారా ఆడపిల్లలకు సురక్ష యోజన పథకం, బేటీ పడావో–బేటీ బచావో నినాదంతో బాలికల సంరక్షణకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కరోనా సమయంలో వాక్సిన్‌లను ప్రజలందరికీ ఉచితంగా అందించిన ఘనత కేంద్ర ప్రభుత్వానికే దక్కిందని పేర్కొన్నారు. అనంతరం వ్యవసాయ పొలంలో డ్రోన్ సహాయంతో మందుల పిచికారీ గురించి రైతులకు ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ రామలింగేశ్వరమ్మ, వైద్యాధికారి రూపశ్రీ, ఆరోగ్య కార్యకర్త భరత్, ఏఎన్‌ఎం నాగమణి పాల్గొన్నారు.



నందిమళ్ల ఎక్స్‌రోడ్‌లో అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఇసుక అక్రమ నిల్వలు

- పట్టించుకోని రెవెన్యూ అధికారులు

కొత్తకోట రూరల్: పెద్దమందడి, కొత్తకోట మండలాల్లో ఇసుక అక్రమ రవాణాకు బ్రేకులు పడటం లేదు. టీఎస్‌ఎండీసీ ద్వారా కమర్షియల్ ఇసుక రీచ్‌లు, సాండ్ ట్యాక్సీ ద్వారా స్థానికులకు ఇసుకను ప్రభుత్వం విక్రయిస్తున్నా కూడా అక్రమ దందా కొనసాగిస్తున్నారు. గత ప్రభుత్వానికి చెందిన నాయకుల కనుసన్నల్లో స్థానికంగా ఉండే కొందరు ఇసుక వ్యాపారులు రాత్రి వేళల్లో పెద్దమందడి మండలంలోని జగత్‌పల్లి వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నా పట్టించుకోవడం లేదని పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాగుల పరివాహక తీరం వెంబడి రహస్య ప్రాంతాల్లో డంపింగ్ చేసి కొత్తకోటతో పాటు ఇతర ప్రాంతాలకు ఇసుకను తరలించేందుకు ఇసుక వ్యాపారులు ప్రయత్నిస్తున్నా రెండు మండలాలకు సంబంధించిన పోలీసు, రెవెన్యూ అధికారులు పట్టించుకోవలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



బుగ్గపల్లితండా సమీపంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక దంపులు

బుగ్గపల్లితండా మీదుగా..

పెద్దమందడి మండలంలోని బుగ్గపల్లితండా మీదుగా కొత్తకోట మండలంలోని కానాయపల్లికి చెందిన కొందరు ఇసుక వ్యాపారులు కొత్తకోట పోలీసు, రెవెన్యూ అధికారులను మచ్చిక చేసుకుని రాత్రివేళల్లో తమ అక్రమ దందాను సాఫీగా కొనసాగిస్తున్నారు. కానాయపల్లికి చెందిన కొందరు ఇసుక, మట్టి వ్యాపారులు రాత్రి, పగలు తేడా లేకుండా స్థానిక అధికారుల కనుసైగలో తమ వ్యాపారాన్ని యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న దళారులకు అడ్డుకట్ట వేసి ప్రభుత్వానికి ఆదాయాన్ని పెంచాలని పలువురు కోరుతున్నారు.

‘ఉపాధి’తో పల్లెలకు ఊతం



తెల్లరాళ్లపల్లితండా చెరువులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

- 2024–25 వార్షిక బడ్జెట్ తయారీకి ప్రక్రియ
- రైతులకు లబ్ధి చేకూర్చే పనులకు మొదటి ప్రాధాన్యత
- ఈ నెల 28 నాటికి ముగిసిన గ్రామసభలు



పనుల ఎంపికపై రేమద్దుల గ్రామసభలో మాట్లాడుతున్న ఏపీఓ కుర్మయ్య

2023-24లో పనుల అమలు ఇలా..

మొత్తం జాబ్‌కార్డులు 15,803	పేర్లు నమోదు చేసుకున్న కూలీలు: 32,000
పనులు చేస్తున్న కూలీల సంఖ్య 8,369	2023-24లో బడ్జెట్ రూ.15 కోట్లు
ఇప్పటి వరకు చేసిన పనిదినాలు 2,30,856	2024-25 సంవత్సరానికి బడ్జెట్ రూ.13 కోట్లు
చేయాల్సిన పనిదినాలు 3,16,000	

పాన్‌గల్: గ్రామీణ ప్రాంతాల్లో వలసలను నివారించి కూలీలకు స్థానికంగా ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తుంది. అందులో భాగంగా 2024–25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే పనులకు సంబంధించిన గ్రామ సభల నిర్వహణకు గతంలోనే మార్గదర్శకాలు విడుదల చేశారు. ఆయా గ్రామాల్లో చేపట్టే పనులపై గ్రామ సభల్లో చర్చించి పంచాయతీకి 20 పనులను ఎంపిక చేస్తున్నారు. బడ్జెట్ తయారీ కోసం ఈనెల 28వ తేదీ నాటికి గ్రామసభల్లో కూలీల సమక్షంలో ఎంపిక చేసిన పనులను ఆమోదిస్తూ తీర్మాణం చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

దీర్ఘకాలిక ప్రయోజనాలకు ప్రాధాన్యం

వచ్చే ఏడాది చేపట్టే పనుల్లో కూలీలకు ఉపాధితో పాటు దీర్ఘకాలిక పనులకు ప్రాముఖ్యం ఇవ్వాలని ఉన్నతాధికారులు సూచించారు. ఉపాధిహామీ చట్టం ప్రకారం వచ్చే ఆర్థిక సంవత్సరానికి గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ఆర్థిక బడ్జెట్ తయారు చేస్తున్నారు. ఒక్కో ప్రాంతంలో అనుకూలతను బట్టి ఉపాధిలో కేటగిరీలుగా 266 రకాల పనులు చేసుకునే అవకాశాలున్నాయి. కూలీలు, ప్రజాప్రతినిధులతో పంచాయతీల్లో సమావేశాలు నిర్వహించి పచ్చదనం, పూడికతీత, రైతుల పొలాల్లో పనులు, అనువైన ప్రాంతాల్లో భూగర్భజలాల పెంపు, ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టనున్నారు.

వసతులు కల్పించాలి



నూతన సంవత్సరం నుంచి మండలంలో చేపట్టే ఉపాధి పనుల్లో కూలీలకు ఇబ్బందులు కలుగకుండా పనుల వద్ద అన్ని రకాల వసతులను కల్పించాలి. పనులు చేసే కూలీలకు కూలి డబ్బులు రెగ్యులర్‌గా ఖాతాల్లో జమ చేయాలి. అవసరమైన పనిముట్లు అందించాలి.

– చెన్నమ్మ, ఉపాధి కూలీ, తెల్లరాళ్లపల్లితండా

ప్రతి కూలీకి పని ఇవ్వాలి



జాబుకార్డు కలిగిన ప్రతి కూలీకి పనులు కల్పించాలి. పని చేసిన వారికి జాప్యం లేకుండా డబ్బులు ఖాతాల్లో జమచేసేలా చర్యలు తీసుకోవాలి. రైతులకు, గ్రామాలకు ఉపయోగపడే విధంగా పనులను గుర్తించాలి. దీంతో పాటు పెండింగ్‌లో ఉన్న కూలీ డబ్బులను మంజూరు చేసి కూలీల ఇబ్బందులను తొలగించాలి.

– రాము, సీఐటీయూ జిల్లా నాయకులు, బుసిరెడ్డిపల్లి

రైతులకు లబ్ధి చేకూర్చేలా..



ఉపాధిహామీ పనుల గుర్తింపు సమావేశాల్లో ప్రయోజనం కలిగించే పనులను ఎంపిక చేసుకోవాలి. గ్రామానికి, కూలీలకు ఉపయోగపడే పనులను గుర్తిస్తేనే మేలు కలుగుతుంది. గ్రామాల్లో భూగర్భ జలాలు పెంచుతూ రైతులకు లబ్ధి కలిగే విధంగా పనులు ఉంటాయి.

– కుర్మయ్య, ఏపీఓ, పాన్‌గల్

అయోధ్య అక్షతలకు పూజలు

కొల్లాపూర్: పట్టణంలోని రామాలయానికి అయోధ్య రామతీర్థట్రస్టు నుంచి అక్షతలను శుక్రవారం విశ్వహిందూ పరిషత్ నాయకులు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కలశాలలో తీసుకొచ్చిన అక్షతలకు ఆలయ అర్చకులు రాఘవేంద్రాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని వివిధ వైష్ణవ దేవాలయాలకు ఆ కలశాలను పంపించారు. జనవరి 1వ తేదీ నుంచి 15వతేదీ వరకు కలశాలలోని బియ్యపు గింజలను భక్తులకు పంపిణీ చేయనున్నట్లు వీహెచ్‌పీ నాయకులు తెలిపారు. 22వ తేదీన అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం రోజున హిందువులు తమ ఇళ్లముందు దీపాలు వెలిగించాలని కోరారు. కార్యక్రమంలో బొమ్మరిల్లు భాస్కర్, ఆకుతోట సుదర్శన్‌శెట్టి, డీలర్ శ్రీనివాసులుశెట్టి, గుగ్గిళ్ల వెంకటయ్య తదితరులున్నారు.